# వ్యసనం

-చివుకుల కృష్ణకుమార్‌శాస్త్రి

"ఆపి అరగంట కాలేదు. మళ్లా వెలిగించారు దిక్కుమాలిన సిగరెట్టు" కస్సుమంటూ లేచింది కళ్యాణి భర్త మీద. ఆ మాట తనకేం పట్టనట్టు వరండాలో నిలబడి ఆనందంగా దమ్ము పీలుస్తున్నాడు సుబ్బారావు. భర్త నోటి వెంట వచ్చే తరువాత రొటీన్ డైలాగ్ గుర్తుకువచ్చింది.

"అసలు తప్పు నాది. బుద్ధి బురదలోకి లాగి శనిగాడు నెత్తిన కూర్చుని ఆ రోజు నాచేతలా పలికించాడు. లేకపోతే ఈనాడీ తిప్పలుండేవా?" అంది బిగ్గరగా భర్తకి వినబడేటట్టుగా.

ఉదయం పదకొండు గంటలకు పెళ్లయింది. సాయంకాలం ఆరుగంటలకు అప్పగింతలు. అత్తగారింటికి వెడుతుంటే బస్సులో భార్య పక్కన కూర్చున్నాడు సుబ్బారావు.

"నేను సిగరెట్ కాల్చుకుంటే నీకేమైనా అభ్యంతరమా?" అనడిగాడు. కొత్త మొగుడి మనస్సు నొప్పించడం ఇష్టంలేని కళ్యాణి "తక్కువగా కాల్చడం ఆరోగ్యానికి మంచిది" అంది.

అంతే.. బస్సులో వెనుక సీట్లో కూర్చుని ఉదయం నుంచీ పెళ్లి హడావుడివల్ల కోల్పోయిన సిగరెట్టు ఆనందాన్ని తృప్తిగా అనుభవించాడు. భార్య మాటను అలుసుగా తీసుకుని సుబ్బారావు తన అలవాటును కొనసాగించాడు.

పదహారురోజుల పండుగ మర్నాడే కాపురానికి వెళ్లింది కళ్యాణి.

కొత్తలో పెద్దగా భర్త అలవాటును పట్టించుకోని కళ్యాణి రానురాను సణగడం మొదలుపెట్టింది.

"తగ్గించండి. మరీ ఎక్కువగా కాలుస్తున్నారు. అయినా ఇదేమన్నా కడుపు నింపుతుందా ఏమిటి దండుగ ఖర్చు తప్ప" అనేది.

సమాధానంగా సుబ్బారావు "అసలు నీకీ విషయం తెలుసా? నీతో పెళ్లి కాకముందు దీంతోనే నా కాలక్షేపం. ఇదే నా తోడు" అన్నాడు. మొగుడి మాటలకు ఒళ్లు మండింది కళ్యాణికి.

"ఏమిటట ఆ తోడు? వండి వార్చిందా? పక్కన పడుకుని కబుర్లు చెప్పిందా? భార్యగా మీ అవసరాలు తీర్చిందా?" అంది.

సమాధానంగా సుబ్బారావు నుంచి చిరునవ్వు వచ్చేదామెకు.

"అసలు నాకీ సిగరెట్ వాసన పడదు. మీరు కాల్చద్దు. సిగరెట్ అలవాటున్న నలుగురైదుగురు పెళ్లికొడుకుల్ని నేను కాదన్నాను అని ఆ రోజు చెప్పి వుంటే ఈ రోజు మనిద్దరి మధ్యా ఈ గొడవలు ఉండేవికావు" అంది రుసరుసలాడుతూ.

"కరెక్టు నువ్వారోజు ఆ మాట అని ఉంటే నేనప్పుడే ఈ అలవాటును మానుండేవాడినేమో!"

★★★

లెక్క చూస్తే దగ్గర దగ్గరగా ఓ పెట్టె...రోజుకి ఇరవై రూపాయల ఖర్చు. సెలవు రోజు ఇంట్లో వుంటే తన కళ్లపడేవి ఇవి. మరి ఆఫీసులో ఉంటే మరింకెన్నో? ఇల్లు ఊడిచేటప్పుడు యాష్ట్రే ఖాళీ చేస్తూ కాల్చిన సిగరెట్టు పీకలు లెక్కపెడుతూ భార్య సాధింపులు భరించలేని సుబ్బారావు యాష్ట్రేని అటకమీద పడేసాడు, అలవాటును తన దగ్గరుంచుకుని. ఏదైనా ప్రయాణం కడితే చాలు... బట్టలకన్నా ముందు పెట్టెలో చోటు చేసుకునేవి ఈ దిక్కుమాలిన పెట్టెలే.

ఓరకంగా చెప్పాలంటే కళ్యాణికి భర్తలో అన్ని మంచి లక్షణాలే కనిపిస్తాయి. తననెంతో ప్రేమగా చూసుకుంటాడు. ఇది కావాలి అని అడక్కుండానే అన్నీ తెచ్చి పెడతాడు. బజారుకి ఓ చీర కోసం వెళితే రెంటికి పైమాటే కొంటాడు. తను చెప్పకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వేయడు. అన్ని విషయాల్లో భార్య సలహాని అమలుపరుస్తాడు. ఇంత మంచి అలవాట్లు ఉన్న భర్తకు ఈ ఒక్క వ్యసనం ఎలా అయ్యిందో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు కళ్యాణికి.

★★★

పేపర్లో సిగరెట్‌వల్ల కలిగే నష్టాలు, వ్యాధుల గురించి చదువుతుంటే గుండె గుభేలుమంటుంది కళ్యాణికి. ఆమధ్య పబ్లిక్‌లో ధూమపానం చేసినవారికి జరిమానా అన్న వార్త విని సంతోషించింది. కాని అమలుకాని ఆ రూలు ఆమెను నీరు కార్చింది.

సిగరెట్టు పెట్టెపై పుర్రెబొమ్మ వేయాలని అధికార పార్టీవాళ్లు, వీల్లేదని అమ్మకందార్ల మధ్య రేగిన దుమారంవల్ల అయినా ఈ సమస్యకు పరిష్కారం అవుతుందనుకుంటే అది చెట్టెక్కింది.

'సరదా సరదా సిగరెట్...' అన్న పాట టీవీలో వస్తుంటే ఠక్కున ఆఫ్ చేస్తుంది కళ్యాణి కోపంతో.

భార్య ఆఫ్ చేసినంత వేగంగానూ తను ఆన్ చేస్తాడు సుబ్బారావు ఆ సాహిత్యానికి ముగ్ధుడవుతూ. కత్తికి రెండువైపులా పదును అన్నట్లుగా కవిగారు ఇష్టాలు నష్టాల గురించి రాసినా నష్టాల గురించి ఎవరు ఆలోచిస్తారు.

అన్నీ సుగుణాలే వున్న సుబ్బారావులో వున్న ఈ వ్యసనాన్ని ఎలాగైనా మాన్పించాలన్నది కళ్యాణి ధ్యేయం.

ఒకసారి ప్రేమగా, మరోసారి బాధగా, కోపంగా, సూటిపోటి మాటలతో ఏ రకంగా చెప్పినా విన్నట్లే ఉన్నా మళ్లీ వినకుండా ఉండేవాడు సుబ్బారావు. వ్యసనానికి బానిస అయిపోవాలా అన్నది కళ్యాణి వాదన.

"తల్చుకుంటే ఈ క్షణాన మానేయగలను. నేను చెప్పి చేయను. చేసి చూపిస్తాను" అన్న భర్త మాటమీద నమ్మకంతో వేచి చూసింది కళ్యాణి. షరా మామూలే అవడంతో మళ్లీ పోరు మొదలుపెట్టింది.

"చాలా తగ్గించాను తెలుసా?" అన్నది అతగాడి సమాధానం. ఆ మాట నిజమో కాదో కళ్యాణికి తెలుసు.

అక్కడికీ మృదువుగా చెప్పింది "ఈ అలవాటు ఒక్కసారిగా ఎవరూ తగ్గించలేరు. మెల్లమెల్లగా తగ్గించడం అలవాటు చేసుకోండి"

కళ్యాణి మాటలకు అలాగేనని తలూపేవాడే గానీ అతగాడి అలవాటు అతనిదే. ఒకసారి వ్యసనానికి బానిసైనవాళ్లు దాన్ని జయించడం కష్టమే. నిత్యావసర వస్తువులు కొండెక్కి కూర్చోవడంతో అనవసర ఖర్చుల జాబితాలో మొట్టమొదటగా సిగరెట్ నిలిచింది కళ్యాణి దృష్టిలో. రోజుకి ఇరవై రూపాయల చొప్పున నెలకు ఆరు వందలు. ఎలా అయినాసరే భర్తను ఈ అలవాటు నుంచి ఏం చేసి మానిపించాలా అన్నది కళ్యా



ణిని అనుక్షణం వేధించే ఆలోచన.

***

ఆ నెల పచారి సరుకుల నిమిత్తం సూపర్ మార్కెట్‌కు వచ్చిన కళ్యాణికి బిల్లు చూస్తుంటే క్రితం నెలకు, ఈనెలకు బాగా తేడా కన్పించింది.

బియ్యం, కందిపప్పు... అనేమిటి ఏ ఒక్క సరుకు కూడా స్థిరమైన ధర మీద ఉండడంలేదు. అనుకోకుండా ఆమె దృష్టి వక్కపొడి మీద పడింది. వంద గ్రాములు నలభై ఐదు రూపాయలు.

"వక్కపొడి రేటు పెరిగిందా ఏమిటి?'' అడిగింది షాప్ అతన్ని.


'కొత్తగా పెరిగేదేముందమ్మా... చాలా రోజుల నుంచి ఇదే రేటుగా'' అన్నాడు.

అంటే ప్రతి నెలా బిల్ చూసి గుడ్డిగా డబ్బు ఇవ్వడం తప్ప ధరలమీద దృష్టి నిలపకపోవడం తనదే తప్పు. నెలకు పావుకేజీ వక్కపొడికి నూట పది



## కంగనా సంచలనం

కంగనా రనౌత్ 'రాజ్-2' సినిమాలో చేసిన అర్ధనగ్న సీన్లు సంచలనం సృష్టించాయి. ప్రముఖ ఫోటోగ్రాఫర్ డబూరత్నాని తీసిన ఓ ఫోటోషూట్ లోనూ తన 'న్యూడ్ పర్సనాలిటీ'తో మరోసారి అందరూ ముక్కున వేలేసుకునేలా చేసింది. తాజాగా ఆమె తన అందాల ప్రదర్శనతో మరోసారి వార్తలకెక్కబోతోందిట. పూరి జగన్నాథ్ తీస్తున్న తాజా చిత్రం 'ఏక్ నిరంజన్'లో నాయికగా నటిస్తున్న కంగనా హాట్ హాట్‌గా కనిపించబోతోందిట. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని కొట్టిపారేస్తోంది కంగనా.




రూపాయలు. అంతే చప్పున రెండు పేకెట్లు పక్కనపెట్టి ఒక్క వందగ్రాములు మాత్రం వుంచింది.

"ఏమటమ్మగారు పొదుపు పాటిస్తున్నారు?'' అన్నాడు షాప్ అతను నవ్వుతూ.

"అవును మరి...మీరెలాగూ ధరలు తగ్గించరు. ఇక మేమే వస్తువులు తగ్గించుకోవాలి'' అంది.

"మాదేముందమ్మా... మేము డబ్బు ఖర్చు పెట్టి తేవాల్సిందేగా. కాక పోతే ఒక్క రూపాయి లాభం'' అన్నాడు.

'వచ్చేనెల నుంచి ఈ వంద గ్రాములు కూడా మానేయాలి. తినకపోతే ప్రాణం పోతుందా ఏమిటి?' అనుకుంది కళ్యాణి.

***

మర్నాడు భోజనం పూర్తయింది. కళ్యాణి వక్కపొడి జోలికి పోలేదు. మనసంతా ఏదోగా ఉంది. ఎంత వద్దనుకున్నా మనసు ఫ్రిజ్‌మీదనున్న వక్కపొడి మీదకే పోతోంది. రా...రమ్మని పిలుస్తున్నట్లుగా అన్పించింది. బాగా అలవాటు కదా. వక్కపొడి పంటికింద పడకపోతే అన్నం తిన్నట్లుగా అన్పించలేదు కళ్యాణికి. ఏదో వెలితిగా అన్పించసాగింది. పెళ్లి కాక ముందు నుంచి కూడా అన్నం తినడం తరువాయి నోట్లో వక్కపొడి ఉండి తీరాల్సిందే. తన అలవాటు చూసి అమ్మ కోప్పడేది. కంచంలో ఓ పక్కగా వక్కపొడి కూడా వేసుకుంటే సరిపోతుందని అనేది.

ఆ ఒక్క పలుకు వేసుకుంటే ఏమవుతుంది అనుకుంది. ఎన్నాళ్ల నుంచో వున్న అలవాటును ఒక్కసారిగా మానడం అంటే సాధ్యమవుతుందా మళ్లీ తనే అనుకుంది. అది విషం అనుకుంటే సరిపోదా. వక్కపొడి డబ్బా కళ్ల ముందు నుంచి కనబడకుండా దాచి పెట్టింది. కళ్ల ముందు నుంచి అయితే తీసిందిగానీ మనస్సులోంచి తీసేయలేదుగా. అతి కష్టంమీద రెండురోజులు అంటే నాలుగుపూటలు ఆ ఛాయలకు వెళ్లని కళ్యాణి అయిదోపూట ఆగలేకపోయింది. ఆ ఒక్క వక్క పలుకు నోట్లో వేసుకుంది. తరువాత పూట నుంచి ఒక్క పలుకు స్థానే మరిన్ని పలుకులు యధాప్రకారం చేరాయి.

ఒక్కసారిగా ఛెళ్లున కొట్టినట్లయింది కళ్యాణికి ఆ ఆలోచన. అలవాటుకి బానిస అవడం అంటే ఇదేనా? తన అలవాటువల్ల అదనపు డబ్బు ఖర్చు తప్ప మరే లాభంలేదు. ఏ అలవాటు అయినా అయినంత తొందరగా మానలేం. మానడానికి తనింత సతమతమవుతుంటే మరి ఆయన సంగతి కూడా అంతేగా. తను భర్తని వేధించి సాధిస్తోందిగానీ ఆయన ఏనాడూ తన వ్యసనాన్ని వేలెత్తి చూపలేదే? ఇంట గెల్చి రచ్చ గెలవగలనన్న సామెత గుర్తుకొచ్చింది ఆమెకు. వ్యవసాన్ని జయించి గెలుపొందడం అన్నది మనిషి మనసుమీద ఆధారపడి వుంటుంది. ఆ మనసుని తన ఆధీనంలో వుంచుకోవాలి. రేపట్నించి ఖచ్చితంగా తన వక్కపొడి అలవాటుకి ఉద్వాసన చెప్పి భర్త వ్యసనం మీద ఉద్యమించాలని స్థిరనిర్ణయం తీసుకున్న కళ్యాణి వక్కపొడి డబ్బాను గోడ అవతల పారేసింది.

అదే సమయంలో ఆఫీసులో సిగరెట్ వెలిగించబోతూ ఒక్క క్షణం ఆగాడు సుబ్బారావు. పాపం కళ్యాణి పిచ్చి మొహంది. పెళ్లయిన దగ్గర్నుంచి తనతో సిగరెట్ మాన్పించాలని విశ్వప్రయత్నం చేస్తోంది. తల్చుకుంటే ఈ వ్యసనానికి ఒక్క క్షణంలో గుడ్‌బై చెప్పవచ్చు.

ఆ క్షణాన్ని ఈ క్షణాన్నే ఆహ్వానించి రాబోయే పండుగ కానుకగా భార్యకు తన నిర్ణయాన్ని చెప్పాలని అనుకున్న సుబ్బారావు చేతిలోని సిగరెట్టు పేకెట్ నలిపి లైటరుతోసహా డస్ట్‌బిన్‌లో పారేసి వ్యసన భారాన్ని దింపుకున్నాడు.

☆